


తలనమ్ముకున్న జీవితానికి భరత వాక్యం పాడి కలకత్తా వదిలి తెలుగు దేశంలో కాపురం పెట్టే సరికి తల ప్రాణం తోకకొచ్చింది. అయినా తెలుగు నేలలో కాలు మోపినందుకు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయేను. స్వంత 'కొంప' అంటూ ఒకటుంటే జీవితం సాఫీగా సాగిపోతుందని అయిన వాళ్లూ అంటున్నా, రిటైరయ్యాక న్కా కొచ్చిన పి.ఎఫ్ గ్రాట్యూయిటీ కలబోసినా పాత పెంకుటిల్లు తప్ప మరేదీ రాదని అర్థమయింది.

ఉన్నదంతా దానికే స్వాహా చేస్తే ఆ మర్నాటి నుంచీ పెంకురాలిందనీ, సున్నం ఊడిందనీ, గోడ పడిందనీ, గచ్చు పగిలిందనీ, ఆ పాత పెంకుటిల్లు పెట్టే ఘోష పట్టించుకోగలనా? నెలనెలా వచ్చే పెన్షను డబ్బులతో బ్రతకాల్సిన జీవితాలకి వెనకాతల అంతో యింతో వేడినీళ్లకి చన్నీళ్లలా ఉండక పోతే బ్రతుకు రోడ్డెక్కదూ? ఇలా ఏదో క్రిందా-మీదా పడి ఒక పెద్ద కొంప వేటాడి గృహప్రవేశం చేసి 'హమ్మయ్య!' అనుకున్నాను. అక్కడికి ఏదో సమస్యలన్నీ తీరి ఒడ్డున పడ్డానని ఆనందించేను! ఇక అప్పట్నుంచీ దిన చర్య సాగి పోతూంది. ఏవో చిన్న చిన్న ఒడిదుడుకులు ఉన్నా పరవాలేదు.

నేను ఎన్నుకున్న ఊరు మహానగరం కాకపోయినా నగరమే... జిల్లా కేంద్రం... చుట్టూ చిన్నా-పెద్దా ఊళ్లకు కూడలి. మా బంధువర్గం అంతా ఆ చుట్టుపట్లే ఉన్నారు. బస్సు రూట్లో గంట-గంటన్నర ప్రయాణ పరిధిలోనే ఉన్నారు. 'నాన్‌స్టాప్' బస్సు ఎక్కితే గంట ప్రయాణంతో మహానగరం! మరి - నేను ఎన్నుకున్న వూరు అన్ని సదుపాయాలూ ఉన్నదే! కాకపోతే నా చిన్నప్పట్నుంచీ చూస్తున్న దృశ్యాలు. ఆ నగరంలో ఇప్పటికీ అలాగే 'పాతకంపు' సారీ! పాతవాసనలతో అలాగే వుంది. ఊరు చివర్లో చిన్న చిన్న కాలనీలు

లేహాయి - తప్ప ఏ విషయంలోనూ ఈ ఊరికి ఎదుగూ-బదుగూ లేదు!

సరే! ఏదో 'డేరా' వేసేను కనుక చుట్టు ప్రక్కల ఉన్న బంధువుల ఇళ్ళు చూడాలన్పించింది. ఇన్ని సంవత్సరాలూ కలకత్తాలో ఉండటం మూలాన ఎప్పుడో కాని ఆ ఊళ్ళు చూడటం కుదిరేదికాదు! రైలు ప్రయాణాలూ దూర ప్రయాణాలు చెయ్యడమే అలవాటు. బస్సు ప్రయాణం అతి తక్కువ! కలకత్తాలో సిటీ బస్సు ప్రయాణం దినచర్యే! అది వేరే విషయం. దగ్గర్లోనే బంధువర్గం ఉండటం మూలాన అక్కడికి బస్సు ప్రయాణమే సదుపాయం.

ఒక రోజు ఉదయమే లేచి కాలకృత్యాలు తీర్చుకుని బస్సు స్టాండుకి వెళ్లాను. మా స్వంత ఊరు అని చెప్పుకునే ఊరికి బయలుదేరాను. అది గంటన్నర ప్రయాణం బస్సు చార్జీలు తరచూ మారుతుండటంతో నాకు సరియైన చార్జీ ఎంతో తెలియదు. మా ఊరు బస్సెక్కి కండక్టరుకి ఏభైరూపాయల నోటిచ్చేను. ఏవో రెండు మూడు రకాల టిక్కెట్లు చింపి టక్కు-టక్కుమని 'పంచ్' చేసి అవి నా చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. ఆ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ ఉద్యోగి! ఆ టిక్కెట్లు అన్నీ సరిచేసి వాటి విలువ కూడితే పదిహేడున్నర రూపాయిలయింది. అయితే నేనిచ్చిన ఏభైకి చార్జీ పోను మిగతా ముప్పైరెండున్నర చిల్లర ఇవ్వాలిగా? ఆ కండక్టరు మహాశయుడ్ని పిలవగా-పిలవగా నా వైపు వచ్చి ఛీత్కారంగా ఏమిటన్నట్లు చూశాడు!

"మిగతా డబ్బులేవీ?" అన్నాను.

"చిల్లర లేదు... తర్వాత ఇస్తాలే!" అంటూ గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

మరొక అరగంట పోయేక అతడు తన సీట్లో కూర్చుని డబ్బులు లెక్కపెట్టుకుంటున్నాడు. అదే మంచి అదను అనుకుని అతడి దగ్గరకు వెళ్ళి "మిగతా డబ్బులివ్వండి" అన్నాను.

అతడు తలెత్తకుండానే "ఇస్తాలేవయ్యా! ఏం? పారిపోతానా? నువ్వుదిగేటప్పుడిస్తాలే!" అని మళ్లీ నోట్లూ చిల్లరా లెక్క పెట్టుకోసాగాడు. మరొక గంట అయ్యాక మా ఊరొచ్చింది. నేను గబ-గబ నాచేతి సంచీ తీసుకుని దిగబోతూ...

"మిగతా బేలన్సు ఇవ్వండి" అన్నాను.

అతడు నా వైపు గుర్రుగా చూస్తూ ముప్పై రూపాయలు నా చేతిలో పెట్టి ఎదురుగా వున్న ఇనుప కమ్మిపై టక్-టక్ మన్పించేడు. బస్సు మళ్లీ స్టార్టయింది. నేను గాభరాగా క్రిందకి దిగుతూ.

"మరి మిగతా రెండున్నరో?"అన్నాను.

అతడు 'రైట్ రైట్' అంటూ విసుగ్గా "చిల్లర లేదు" అన్నాడు. బస్సు కదిలిపోయింది. నేను తెల్లబోయి వెళ్లిపోతున్న బస్సువైపే చూస్తుండిపోయాను! పది నిమిషాల వరకూ తేరుకోలేదు.

"మాష్టారూ! రిక్షాకావాలా?" అన్న పిలుపుతో త్రుళ్లిపడి వెనక్కు తిరిగే సరికి రిక్షా అక్కడ పెట్టి అతడు అడిగేడు. ఎండలో రావటం మూలాన వెంటనే మారు మాటడక ఎక్కేశాను.

నిజంగా చూస్తే అక్కడికి మా వాళ్ల ఇల్లు ఎంతో దూరం లేదు. సులువుగా నడిచిపోవచ్చు. చేతి సంచీ తప్ప. బరువు లేదు అయినా ఎండ మూలాన, రిటైరయ్యాక వెళ్తూ వెళ్తూ నడిచి వెళ్తే అదొక నామోషీ! ఇవన్నీ ఆలోచించకపోయినా రిక్షా ఎక్కి మావాళ్ల ఇల్లు వీధి పేరు చెప్పేసరికి సరిగ్గా అక్కడికే తీసుకువెళ్లి ఆపేడు.

రిక్షా దిగుతూ వాడిచేతిలో పదిరూపాయల నోటు పెట్టేను. వాడు సంతోషంగా అందుకుని, దండంపెట్టి రిక్షా రోడ్డు వైపు త్రిప్పాడు. అదేమిటి? వీడు చిల్లర ఇవ్వడేం? అనుకుని..

"ఏయ్ రిక్షా అబ్బీ చిల్లర ఇయ్యి" అన్నాను.

## పాయసం పద్యాలు

### మరుపూరు స్మృతికి!

హాలికుడని కలం పేరు, పొట్లపూడి
స్వంత ఊరు, సాహిత్యం జాలువారు,
మనసేమో కుర్రకారు, సన్మానం పూల తేరు
అనువాదం సెలయేరు, అతడే మరుపూరు!

### సంక్రాంతి వ్యథ!

నిన్నటి పండుగ సంబరాలు
అన్నా నేడేడ, పాతరోతై, బతుకు స్పీడైపోయా!
కమ్మని బంధు ప్రేమ అభిమానాలు
కలలై, కల్తీలై 'మనీ'లోక మాయే దునియా!!

✳ ✳ ✳

అన్నీ కోల్పోయి ముగ్గులు మిగుల్చుకొంది
సంక్రాంతి, జాడలేవు భోగిమంటలు!
రానేరావు కనుమ పాతరోజులు
ఏవి తల్లీ నిరుడు విరిసిన విక్రాంతులు!!

### పచ్చి పులుసు!

చిక్కటి చింత పండునీట,
తరిగిన ఉల్లిగడ్డ, పచ్చి మిరప ముక్కలు
ఉప్పును జోడించి, మిరియంపు పొడి జాడించి,
చక్కగ పిసికి వేడి అన్నముతో ముద్దలు
లాగించిన అన్నా! నిక్కము అష్రుచికి
నాలుక నాట్య మాడును మేన్పులకరించి!


**- పాయసం సుబ్రహ్మణ్య మహర్షి**

"ఏంటి సార్? పెద్దాయన మీరు అలాగ అంటారు! ఈ రోజుల్లో పదిరూపాయలకు ఏంటొస్తుందండీ?" అంటూ రిక్షా త్రిప్పి వెళ్లిపోయాడు. నేను తెల్లబోయి నిల్చున్నాను.

ఇంతలో తలుపు తీసి మా తమ్ముడి భార్య వచ్చి.. "ఏంటి బావగారూ? అలా నిలబడి పోయారు. ఎప్పుడొచ్చారు?" అని పలకరించి లోపలికి రమ్మంది. అప్పుడు తిరిగి ఈ లోకంలోకి వచ్చేను.

ఇంట్లోకి వెళ్లి ముఖం కాళ్లూ చేతులూ కడుక్కుని అక్కడున్న ఈజీ ఛైర్‌లో నడుం వాల్చాను. ఈలోగా ఆమె కాఫీ తెచ్చి ఇస్తే త్రాగి యోగక్షేమాలు విచారించాను. పరస్పర యోగక్షేమాలు అయ్యేంతలో మా తమ్ముడు వీధిలోంచి వచ్చాడు. పలకరింపులయ్యాక భోజన కార్యక్రమాలు ముగించాం. తర్వాత నడుం వాల్చి లేచేసరికి నాలుగయింది. చొక్కా వేసుకుని అలా వీధిలోకి బయలుదేరాను.

అలా బజారువైపు తిరుగుతూంటే ఏదో నాకు కావలసిన మందు జ్ఞాపకం వచ్చింది. సరేనని మెడికల్ షాపుకు వెళ్లి మందుకొన్నాను. ఆ మందు



## ముద్దులు

మొగ్గ అంచులలోని
సిగ్గు సింగారాలు
చెలియ చెక్కిలి మీద
చెల్లాడితే ముద్దు

గాలి చెలువము సోకి
నిద్రలో నవ్వితే
పూల పెదవుల మీద
పులకరింతల ముద్దు

తరపి వెన్నెల పాల
తరుణి చెంపల మీద
ఎరుపు వన్నెల జోక
ఎదిగితేనే ముద్దు

తొగరు పెదవుల మీద
తలిరు నవ్వులు పూచి
నాజూకు నలిగితే
కొత్త మెత్తని ముద్దు

ఎడద ఓవరిలోని
గుబులు పకతమంత
జమిలిగా జతకడితె
పడతి పెదవికి ముద్దు

- సాంధ్యశ్రీ

ముప్పై తొమ్మిది రూపాయలు. నేనిచ్చిన ఏభైరూపాయల నోటు తీసుకుని ఒక పది రూపాయల నోటూ రెండు చాక్‌లెట్లు చేతిలో పెట్టాడు. నాకు బోధపడక ఈ చాక్‌లెట్లు నాకెందుకన్నాను.

"రూపాయి చిల్లర లేదు సార్" అని ఊరుకున్నాడాయన!

ఓహో! ఇవి చిల్లర చాక్‌లెట్లా? అనుకున్నాను. ఆ మర్నాడు ఉదయం బయలుదేరి తిన్నగా విశాఖ మహానగరం చేరాను. అది సూపర్ డీలక్స్ బస్సు కావటంతో చిల్లర గొడవ లేకపోయింది.

అక్కడ కాంప్లెక్స్‌లో దిగి మా వాళ్ళింటికి వెళ్ళడానికి సిటీ బస్సెక్కాను. అక్కడ కండక్టరుకి పదిరూపాయలు ఇచ్చి నేను దిగవలసిన స్టేజి చెప్పేను. అతడు టిక్కెట్లు చింపి నా చేతిలో పెట్టి ముందుకు దూసుకుపోయాడు. టిక్కెట్టు చార్జి చూస్తే ఐదురూపాయల పావల! మరి మిగతా నాలుగూ ముప్పావలా ఇవ్వలేదే! అతడ్ని పిలుద్దామని చూసే సరికి పద్మవ్యూహంలో జొరబడ్డ అభిమన్యుడిలా ముందుకు దూసుకుపోయి ఆడవాళ్ల సీట్ల వద్ద సెటిలయిపోయాడు. నేను వెళ్ల వలసిన ప్రదేశం ఇంకా దూరం కావటంతో ఏదో స్టాపులో ఇటువైపు రాకపోతాడా అని ఎదురు చూడసాగేను.

అతడు అటూ ఇటూ తిరుగుతూ టిక్కెట్లు కొడుతున్నాడు తప్ప నావైపు రాడేం? అనుకున్నాను. మరొక రెండు స్టాపుల్లో నేను దిగవలసిన స్టేజి వచ్చేస్తుంది. ఇక నా ఓర్పు నశించింది. ఎలాగైతేనేం అతడ్ని పిలిచి నా బేలన్సు డబ్బులడిగేను. అతడు విసురుగా తన బేగ్‌లోంచి నాలుగు రూపాయలు తీసి నా కిచ్చాడు.

"అదేంటయ్యా? మరొక ముప్పావలా ఇవ్వాలి కదా!" అన్నాను. అతడు విన్పించుకోకుండా వెళ్లిపోయాడు. నా పక్కనున్నాయనా అక్కడే హేంగర్స్ పట్టుకుని నిల్చున్నవాళ్ళూ నావైపు అదోలాగ చూశారు!

అప్పుడు నా ప్రక్కనున్నాయనతో అన్నాను "ఇతడు మిగతా ముప్పావలా ఇవ్వడేం?"

అక్కడ నిలబడ్డ వాళ్లు నావైపు ఎగతాళిగా చూసి నవ్వారు. ప్రక్కాయన మాత్రం చిరునవ్వుతో "అది అంతేలెండి" అన్నాడు.

"అంటే? మరి ఇవ్వడా" అన్నాను.

అక్కడ నిలబడ్డ వాళ్లు ఒక వింత చూస్తున్నట్లుగా నవ్వసాగారు. నాకు ఒళ్ళు మండింది. ఏమిటీ మనుషులు అనుకున్నాను.

ఆ కండక్టరు అందరికీ టిక్కెట్లిస్తూ చిల్లర మాత్రం ఇవ్వటంలేదు. ఎవరూ అడగనూలేదు! ఈ మనస్తత్వం చాలా విడ్డూరమన్పించింది నాకు. చిల్లర అడిగితే నామోషియా?

ఒక ముసలమ్మ ఐదు రూపాయల నోటిస్తే మూడూ ముప్పావలాకు టిక్కెట్టిచ్చి మిగతా చిల్లర ఇవ్వలేదు. ఆమె చిల్లర అడిగినా అతడు విన్పించుకోలేదు. ఆమె తన స్టాపు రాగానే లబో-దిబో మని శాపనార్థాలు పెడుతూ దిగిపోయింది. అవి వింటున్న జనం నవ్వుకున్నారు తప్ప ఏమీ అనలేదు.


ఏమిటీ జనం? వీళ్లలో చైతన్యం లేదా? ఇంత నిర్లిప్తంగా ఉంటారేం? సాటి ప్రయాణీకురాలికి అన్యాయం జరుగుతుంటే ఎగతాళిగా నవ్వుతారేం? ఒక్కడూ నోరు విప్పి ఆ కండక్టరును నిలదీయడేం? ఇంత చేతకాని తనం చోట చేసుకుందేం? నలుగురూ కలిసి ఆ కండక్టరును నిలదీస్తే అంత తలబిరుసుగా వెళ్లిపోగలడా? సంచీనిండా చిల్లర పెట్టుకుని ఇవ్వకుండా ఎగవేసే వాడ్ని అడగరేం ఈ జనం?

ఇలాంటి పరిస్థితే కలకత్తాలో వస్తే ఏ ఒక్క కండక్టరూ సవ్యంగా ఇల్లు చేరుకోలేడు! బస్సు ఎంత రద్దీ మీద వెళ్తున్నా ఆపించి దేహశుద్ధి చేస్తారు. అందుకే అక్కడ కండక్టర్లు ప్రయాణీకుల్ని చిల్లరకోసం నిలదీయరు. చిల్లర లేకపోతే తర్వాత డబ్బులు తీసుకుంటారు. అతడు ఏమాత్రం అమర్యాదగా ప్రవర్తించినా అతడి పని సరి!

అందుచేత ఘనత వహించిన మన రాష్ట్రరోడ్డు రవాణా సంస్థవారు మార్పిడి పథకంగా అంటే సాంస్కృతిక కార్యక్రమాలు ఒక ప్రాంతం వారిని మరొక ప్రాంతానికి పంపి ప్రదర్శించినట్లు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఏర్పాటు చేసినట్లు మన రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల్ని బెంగాలీ సిటీలో ఒక ఆరునెలలపాటు శిక్షణ కోసం పంపితే మన డ్రైవర్లకి, కండక్టర్లకి సరియైన శిక్షణ వస్తుందేమో?

ఇలా ఆలోచించుకుంటూ ఉండగా నేను దిగవలసిన స్టేజి వారటంతో దిగిపోయాను. ఎదురుగా ఫాన్సీకొట్టు కనిపించడంతో టూత్ పేస్ట్ కొన్నాను. అతడు ఇరవై అయిదు రూపాయలు తీసుకుని నా చేతిలో ఒక చాక్లెట్ పెట్టాడు. అంటే దాని ధర ఇరవై నాలుగున్నర అన్నమాట.

అప్పుడు నాకొక ఆలోచన వచ్చింది. మన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారు కూడా తమ కండక్టర్లకి బస్సుడిపోనుంచి తీసేక చాక్‌లెట్ల పేకెట్లు కూడా సప్లై చేస్తే పావలా, అర్ధా ముప్పావలా ఇవ్వవలసిన చోట టిక్కెట్లుతో పాటు ఒకటో రెండో చాక్‌లెట్లు కూడా ఇచ్చేస్తే ప్రయాణీకుడు అవి బుగ్గ క్రింద ఉంచుకుని మరి చిల్లర అడగడు కదా! ఏమంటారు? ❁



### మాలాశ్రీ మళ్ళీ హీరోయిన్‌గా!

కన్నడ నిర్మాత రాముని పెళ్ళి చేసుకుని సినీ పరిశ్రమకు దూరమైన మాలాశ్రీ ఇప్పుడు మళ్ళీ సినిమాల్లో నటిస్తోంది. అదీ హీరోయిన్‌గా. ఆ మధ్య యాక్షన్ చిత్రాలు చేసినా అవి ఫట్‌మనడంతో కొన్నాళ్ళు పరిశ్రమకు దూరంగా ఉన్నది. అయితే ఇంట్లో కూర్చొని బోర్ కొడు తుందని మళ్ళీ తిరిగి మేకప్ వేసుకుంటోంది. సినిమాల్లో పునఃప్రవేశం చేసినవారు కేరెక్టర్ ఆర్టిస్ట్‌గానో లేక తల్లిగానో నటిస్తుంటారు. కానీ మాలాశ్రీ మాత్రం ఏకంగా యాక్షన్ చిత్రాల హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది ఎవరోకాదు మాలశ్రీ భర్త రాము.